సాక్షి
జనగామ

శుక్రవారం | 13 | జూన్ | 2025



కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ట్రైయినీ కలెక్టర్లు

కాళేశ్వరం ప్రాజెక్టును ట్రైయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, నలోని చోబ్రా, హర్ష చౌదరి తదితరుల బృందం సందర్శించింది. - 8లో



రెండు గంటలు.. 30 మంది అధికారులు

దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది బృందం సభ్యులు కాజీ పేట రైల్వేస్టేషన్ లో తనిఖీలు నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
34°/26°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'భవిష్యత్ రాజకీయాల్లో బీఆర్ఎస్ అనివార్యం'

దేవరుప్పుల: తెలంగాణ భవిష్యత్ రాజకీయాల్లో బీఆర్ఎస్ అనివార్యమని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. అమెరికా పర్యటన ముగించుకున్న మాజీ మంత్రి దయాకర్ రావు గురువారం ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎర్రబెల్లితోపాటు జిల్లా నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డిని కేసీఆర్ ఆత్మీయంగా దగ్గరికి తీసుకొని క్షేత్రస్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ పార్టీ పూర్వవైభవం కోసం పాటుపడాలని సూచించారు.

ఆద్యకళా మ్యూజియం నిర్మాణానికి స్థల పరిశీలన



చిల్పూరు: ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడడంలో మ్యూజియంలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేశాయితండా పంచాయతీ పరిధి సీత తండాలో గురువారం ఆద్యకళా మ్యూజియం నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు, కళలను తెలిపే ఆద్య కళా మ్యూజియం ఎంతో ఉపయోగమన్నారు. దీని నిర్మాణానికి మహేంద్రకపూర్ 3 ఎకరాల భూమిని ఇస్తున్నారని, మ్యూజియం ఏర్పాటుకు జయధీర్ తిరుమలరావు ముందుకు వచ్చినట్లు తెలిపారు. స్థల పరిశీలన పూర్తయ్యాక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జనగామ రూరల్: ఆర్టీసీ జనగామ డిపోలో శుక్రవారం(నేడు) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధి బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాలఘన్‌పూర్, నర్మెట్ట, తరిగొప్పుల, రఘునాథపల్లి, మద్దూర్, పాలకుర్తి మండలాల పరిధి గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలకు సంబంధించి తమ సమస్యలతో పాటుగా సూచనలు సలహాలను తెలిపేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11.00 గంటల నుంచి 12.00 గంటల వరకు 99592 26050 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: మండలంలోని చౌడారం తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఇంగ్లిష్ బోధించేందుకు అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.సుధీర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తరగతి, ఇంటర్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టుకు తాత్కాలిక పద్ధతిలో గంటల ప్రాతిపదికన బోధించేందుకు ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ అర్హతలు ఉన్న జనగామకు చెందిన స్త్రీ పురుష అభ్యర్థులు అప్లై చేసుకోవాలని సూచించారు. 15వ తేదీలోగా నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98665 75031 ఫోన్ నంబర్‌లో సంప్రదించాని సూచించారు.

ఉచిత వసతికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని బాల సదనంలో బాలికలకు ఉచిత వసతి ప్రవేశాలను వినియోగించుకోవాలని డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 6 నుంచి 13 ఏళ్ల బాలికల కోసం మొత్తం 30 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈబాలసదనంలో తల్లిదండ్రులు లేని బాలికలు, నిరాదరణకు గురైన బాలికలు, కుటుంబ ఆశ్రయం లేని అర్హులైన బాలికలకు ఉచితంగా నివాసం, భోజనం, విద్యా సదుపాయాలు, దుస్తులు, ఆరోగ్య సంరక్షణ ఉంటుందన్నారు. ఐదో తరగతి పూర్తి చేసిన తర్వాత విద్యా అవసరాల కోసం సమీపంలోని పాఠశాలల్లో ఆరో తరగతిలో చేర్పిస్తామని, అర్హులైన బాలికలు కలెక్టరేట్‌లో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9949286780 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యాకన్న రాథోడ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలో చదివే విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

బడి.. విద్యార్థుల సందడి

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- విద్యార్థులకు పూలతో స్వాగతం
- యూనిఫాంలో కొందరు.... కొత్త దుస్తుల్లో ఇంకొందరు
- కలెక్టర్, డీఈఓ, ఉన్నతాధికారుల పర్యటనలు
- యాభై రోజుల తర్వాత మోగిన పాఠశాల గంట
- నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- తొమ్మిది జీరో స్కూళ్లు రీఓపెన్



మొదటి రోజు ధర్మకంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

జనగామ: సర్కారు బడుల పునఃప్రారంభం పండుగ వాతావరణాన్ని తలపించింది. అరటి, మామిడి కొమ్మలు, తీరొక్క పూలతో బడుల ప్రాంగణాలను అలంకరించి, చదువుల తల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. వేసవి సెలవులను ముగించుకుని స్కూల్ బాట పట్టిన విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు. యూనిఫాంలో కొందరు, కొత్త బట్టలు ధరించి మరి కొందరు విద్యార్థులు బడికి వచ్చారు. విద్యార్థుల చేతిలో పూలు పెట్టి ఉపాధ్యాయులు, హెచ్ఎంలు స్వాగతం పలికారు. యాభై రోజుల పాటు ఆడి, పాడుతూ ఎంజాయ్ చేసిన పిల్లలు, నూతన విద్యా సంవత్సరంలో భుజాన బ్యాగు వేసుకున్నారు. మొదటి రోజు తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పై తరగతిలో కూర్చొని సంతోషపడ్డారు. జనగామ మండలం ఎర్రగుండ తండా పీఎస్‌ను కలెక్టర్ పునఃప్రారంభించారు.

నూతన విద్యార్థులు 2,428

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల పాఠశాలలు 548 ఉన్నాయి. వీటి పరిధిలో 45 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు డీఈఓ భోజన్న పర్యవేక్షణలో టీచర్లు బడిబాట నిర్వహించారు. దీంతో విద్యార్థుల సంఖ్యను కొంతమేర పెంచగలిగారు. అన్ని కేటగిరీల్లోని ప్రభుత్వ పాఠశాల ల్లో 1,607, కేజీబీవీ (6 నుంచి12 వర కు) 821 మొత్తం 2,428 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు పొందారు. ఇంకా పెరిగే అవకాశం ఉంది.

తొమ్మిది జీరో స్కూళ్లు పునఃప్రారంభం

జిల్లాలో 72 ప్రాథమిక, ఒక యూపీఎస్ మొత్తం 73 పాఠశాలల్లో జీరో స్ట్రెంత్‌తో రెండేళ్ల క్రితం మూసేశారు. గతంలో మూతబడిన పాఠశాలల్లో బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లి, జయాల, చిల్పూరు మండలం గార్లగడ్డ తండా, దేవరుప్పుల మండలం మల్యతండా, రాజీవ్ కాలనీ, జనగామ మండలం ఎర్ర గుంటతండా, కొడకండ్ల మండలం బోడ తండా, నర్మెట మండలం లుంబియా తండా, పాలకుర్తి మండలం కురుమ తండా పరిధిలో తిరిగి పునఃప్రారంభించారు. తొమ్మిది గ్రామాల్లో ఉపాధ్యాయులు గత నెల రోజుల నుంచి ఇంటింటికీ తిరుగుతూ సర్కారు బడుల్లో బోధన గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి.. బడులను పునఃప్రారంభించడంలో సక్సెస్ సాధించారు.



ధర్మకంచ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పిల్లల హాజరు తీసుకుంటున్న ఉపాధ్యాయిరాలు

నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

పాఠశాలల పునఃప్రారంభం రోజు విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలతో పాటు ఒక జత యూనిఫాం అందించారు. కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు బుక్ బ్యాంకు నుంచి ఇవ్వగా.. తక్కువగా ఉన్న వారి కోసం సర్కారుకు ఇండెంట్ పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



గణేశ్ వాడ పీఎస్‌లో గంటకొడుతున్న సిబ్బంది

అడ్మిషన్ల కోసం క్యూలు..

గతంలో ఎన్నడూ లేని విధంగా 2025–26 నూతన విద్యా సంవత్సరం మొదటి రోజు చాలా చోట్ల సర్కారు బడుల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు క్యూ కట్టారు. జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, బచ్చన్నపేట, రఘునాథపల్లి ఇలా అనేక పాఠశాలల పరిధిలో ఉపాధ్యాయులు ఊహించని విధంగా అడ్మిషన్లు తీసుకున్నారు. కలెక్టర ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు బడి బాట పట్టి వసతి సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజన తయారీ, వడ్డింపు తదితరాలు పర్యవేక్షించారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు: 548
విద్యార్థుల సంఖ్య: 45,000
మొదటి రోజు హాజరు శాతం: 69.8

పుష్పాలిచ్చి.. స్వాగతించి!

నర్మెట: మండలంలోని మాన్ సింగ్‌తండా, కేజీబీవీ, ఆగాపేట పాఠశాలలను సందర్శించిన డీఈఓ భోజన్న విద్యార్థులకు గులాబీ పువ్వులు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మడిపల్లి ఐలయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం నీలం వేణు, హెచ్ఎంలు పైడిపల్లి దామోదర్, గంగరాజు కేశవరావు, ఎస్ఓ బైరోజు రజిత, ఉపాధ్యాయులు రావుల రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.



నర్మెట: విద్యార్థులకు పుష్పాలు అందిస్తున్న డీఈఓ

పాఠ్యపుస్తకాల అందజేత

జనగామ రూరల్: బడిబాట సందర్భంగా మండలంలోని ఓబులకేశ్వాపూర్ ఉన్నత పాఠశాలలో డీఈఓ దర్శనం భోజన్న, ఎంఈఓ శంకర్ రెడ్డి గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగిళ్ల నర్సింహారెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్రీమతి బత్తెపు ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోనే గౌరవం

ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం బడి బాటలో భాగంగా జనగామ మండలం ఎర్రకుంట తండా మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పునఃప్రారంభించారు. ఎర్రకుంట పాఠశాలకు 28 మంది విద్యార్థులు వచ్చేలా కృషి చేసిన ఉపాధ్యాయురాలు రేష్మాను అభినందించారు. కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ భోజయ్య, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పనులు సత్వరమే పూర్తి చేయండి



పాఠశాలలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

రఘునాథపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని నిడిగొండ, కంచనపల్లి పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి భోజయ్య, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, పీఆర్ ఏఈ భరత్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంస పత్రాల పంపిణీ

జనగామ రూరల్: కార్పొరేట్ కళాశాల విద్యను విద్యార్థులు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ఇంటర్‌లో కార్పొరేట్ కళాశాలలో చేరుతున్న 15 మంది విద్యార్థులకు ప్రవేశపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, మైనార్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు డాక్టర్ విక్రమ్, రవీందర్ సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

'బడిబాట'పై పాట



ల్యాప్‌టాప్‌లో పాటను వింటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీఈఓ భోజయ్య

ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత, నాణ్యమైన విద్య, విద్యా ప్రాముఖ్యాన్ని కళ్లకు కట్టినట్లుగా అల్లూరి రవీందర్ రాసిన, వసంత, జ్యోతి, యమున టీచర్లు గానం చేసిన బడి బాట పాట వీడియోను కలెక్టర్ రిజ్వానా భాషా, డీఈఓ భోజన్న మండలంలోని ఎర్రకుంట తండా పాఠశాలలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల నమోదుకు చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు.

రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

తరిగొప్పుల: భూభారతి రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, డీటీ మందాడపు రామారావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. గురువారం జనగామ మండలం ఎర్రకుంట తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే బిల్లులు కూడా త్వరగా అందుతాయన్నారు. తండాకు చెందిన మాలోతు అనితను ఇంటి నిర్మాణం వివరాలు అడిగి తెలుసుకున్నారు.



జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మల్లికార్జునరావు

రఘునాథపల్లి: క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కె.మల్లికార్జునరావు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వంద రోజుల టీబీ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక క్షయ వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. టీబీ నిర్ధారణ కోసం వచ్చిన వారితో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మొబైల్ యాక్టివ్ కేస్ ఫైండింగ్ యూనిట్, సీవై టీబీ పరీక్షలను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వైద్య శిబిరంలో పాల్గొన్న 155 మంది టీబీ అనుమానితులకు ఎక్స్‌రే, సీబీ నాట్ పరీక్ష, సైడ్ టీబీ స్క్రీన్ టెస్ట్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు అశోక్, కమల్‌హాసన్, పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, సీహెచ్ఓ రామ్‌కిషన్, జిల్లా క్షయ నిర్ధారణ బృంద సభ్యులు చంద్రారెడ్డి, విశ్వనాథ్, మధు, అంజుకుమార్, శ్రవణ్‌కుమార్, సూపర్‌వైజర్లు సుజన, రజనీ, సులోచన తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖాధికారి మల్లికార్జునరావు

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు రైతులకు చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో హామీలు అమలు చేయాలని గురువారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులకు రుణ విముక్తి చేయాలని, రుణ విమోచన చట్టం తేవాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు, వ్యవసాయ ప్రైవేటు మార్కెట్ల ముసాయిదాను వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతులకు చేసిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి లింగనబోయిన కుమారస్వామి, నాయకులు మొగిలి, రాజు, మల్లయ్య, సోమయ్య, లింగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ఫిట్‌నెస్ ఆలస్యమేనా?

- ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల నిర్లక్ష్యం
- నిబంధనలు తుంగలో తొక్కి.. రోడ్డెక్కుతున్న బస్సులు
- జిల్లా రవాణా శాఖ ఉక్కుపాదం
- విజిలెన్స్ అధికారుల తనిఖీలు
- ఒక్కరోజే మూడు బస్సుల సీజ్

జనగామ: ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బస్సు సర్వీసుల సేవల విషయంలో కాసింత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు పిల్లలను తీసుకొచ్చే సమయంలో ఆర్టీఏ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కిటికీలకు జాలీలు, డోరు వద్ద క్లీనర్ పర్యవేక్షణ తప్పనిసరి. బస్సు ఎక్కి పాఠశాలకు చేరుకుని, తిరిగి ఇంటికి చేరే వరకు కేర్‌గా చూసుకోవాలి. గతంలో జిల్లాలోని రెండు ప్రాంతాల్లో విద్యార్థులు బస్సు దిగి వెళ్లే క్రమంలో చక్రాల కింద నలిగి మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ఇతర ఆర్టీఏ నిబంధనలు పాటించాలని సంబంధిత అధికారులు పదే పదే చెబుతూనే ఉన్నారు. వేసవి సెలవులు ముగిసే సమయంలో ఇరవై రోజుల ముందు నుంచే అన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలకు నోటీసులను పంపించారు. జిల్లాలో 190 ప్రైవేట్ స్కూల్ బస్సులు ఉండగా.. ఇందులో 150 సర్వీసులకు ఫిట్‌నెస్ పూర్తయ్యింది. మరో 40 బస్సులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 20 బస్సులకు ఆర్టీఏ నిబంధనలు లేకపోవడంతో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రిజెక్ట్ చేయగా, మరో 20 బస్సులకు మరమ్మతులు చేయిస్తున్నారు.



సీజ్ చేసిన బస్సుకు సంబంధించి పత్రాలను డ్రైవర్‌కు అందిస్తున్న విజిలెన్స్ అధికారి

మూడు బస్సులు సీజ్..

జిల్లాలోని పలు పాఠశాలల ప్రైవేట్ స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడిపిస్తూ రవాణా శాఖ అధికారులకు గురువారం పట్టుబడ్డాయి. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక విజిలెన్స్ అధికారి పాహిమా సుల్తానా (అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో సాన్‌మారియా స్కూల్‌కు చెందిన రెండు, చంపక్‌హిల్స్ న్యూ క్రియేషన్ పాఠశాల ఒక బస్సు ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతుండడంతో విజిలెన్స్ అధికారులను పట్టుకున్నారు. మూడు బస్సులను సీజ్ చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

- జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్



ఆదర్శ పాఠశాలలో బుక్స్ పంపిణీ చేస్తున్న డీఏఓ రామారావు నాయక్

బచ్చన్నపేట: విద్యార్థులు చదువుకుంటేనే బంగారు భవిష్యత్ ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ, కస్తూర్బాగాంధీ, సెకండరీ పాఠశాలల పరిసరాలను మధ్యాహ్న వంటను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు బుక్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక వసతులు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు వాటిని వినియోగించుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, పాఠశాల ప్రిన్సిపాళ్లు భారతీదేవి, గీత, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎవరూ నిరుత్సాహ పడొద్దని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల మండలంలోని సాల్వాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను దశల వారీగా ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు. పదేళ్లుగా ఎదురు చూస్తున్న సొంతింటి కల కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో నెరవెరబోతోందన్నారు. అలాగే గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, నాయకులు జంగిటి విద్యానాథ్, హరిబాబుగౌడ్, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, అల్వాల ఎల్లయ్య, సందీప్, మసూద్, బాలకిషన్‌గౌడ్, హరీష్, రాములు, స్వామి, రమేశ్, బాలరాజు, సురేందర్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.



సాల్వాపూర్‌లో గృహ ప్రవేశ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, తదితరులు

సామూహిక నిరాహార దీక్షకు సిద్ధంగా ఉండాలి

చిల్పూరు: 2024 పెన్షనర్ల పెండింగ్ బిల్లులను చెల్లించడంలో జాప్యం చేస్తున్నందున సీఎం ఇంటి ఎదుట చేపట్టబోయే సామూహిక నిరాహార దీక్షలకు బాధిత పెన్షనర్లు సిద్ధంగా ఉండాలని జిల్లా పెన్షనర్ల సాధన పోరాట సమితి అధ్యక్షుడు ఇనుగా ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం మాట్లాడుతూ.. పెన్షనర్ల పెండింగ్ బిల్లుల విషయంలో సీఎస్ రామకృష్ణారావు అలసత్వం ప్రదర్శిస్తూ కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారన్నారు. గతంలో కోర్టును ఆశ్రయించగా.. 10 రోజుల్లో చెల్లించాలని ఆదేశాలివ్వగా.. అప్పటి సీఎస్ శాంతికుమారి ఆ గడువులో చెల్లించారని, కొత్తగా నియమితులైన సీఎస్ రామకృష్ణారావు ఇప్పటి వరకు పెండిగ్ బిల్లులు, డీఏలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈకుభేర్‌లో జరుగుతున్న విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షిస్తామని, వెంటనే క్రమ పద్ధతిలో చెల్లించే ఏర్పాట్లు చేయకపోతే సీఎం ఇంటి ఎదుట సామూహిక నిరాహార దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు.

పూజారుల భవనం ప్రారంభం


పూజారుల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలో రూ. కోటి 98 లక్షలతో నిర్మించి సమ్మక్క, సారలమ్మ పూజారుల సముదాయ భవనాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క.. పూజారులతో సమావేశమై జాతర నిర్వహణపై చర్చించారు. జాతరలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై పూజారులు మంత్రికి వివరించారు. అంతకుముందు మంత్రి సీతక్క తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు మంత్రి సీతక్కకు పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవీందర్, ఈఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారులు కాక సారయ్య, అరుణ్‌కుమార్, భోజరావు, కాక కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న ఎంఓపీఆర్‌డీ బృందం


పూజలు చేస్తున్న ఎంఓపీఆర్‌డీ బృందం

మంగపేట: మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి వారిని మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీ(ఎంఓపీఆర్‌డీ) భారత ప్రభుత్వ న్యూఢిల్లీకి చెందిన రాంబాబుగుప్తా, సమీ అశ్రర్ మిశ్రా బృందం గురువారం దర్శించుకుంది. అనంతరం మండలంలోని వాడగూడెం గ్రామాన్ని సందర్శించి పెసా చట్టం అమలు తీరుపై లఘు చిత్రం చిత్రీకరించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ ఎస్‌డీసీ డీటీ అనిల్, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, టీజీఎండీసీ డీపీఓ మేకల కిరణ్, పెసా మొబిలైజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, మొబిలైజర్లు పూసం కార్తీక్, మడి శోభన్‌బాబు, పాయం రమేశ్, పూనెం రఘురాం, పున్నం శ్రవణ్, యాలం శ్రీను, తాటి విజయ్‌బాబు పాల్గొన్నారు.

7 నుంచి కరీంనగర్, తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్

ఖిలా వరంగల్: జూలై 7వ తేదీ నుంచి కరీంనగర్–తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్ నడుపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8న తిరుపతి– కరీంనగర్ వీక్లి వన్స్ ట్రైన్ నడవనుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రెండు గంటలు.. 30 మంది అధికారులు

కాజీపేట జంక్షన్‌లో రైల్వే సేఫ్టీ బృందం తనిఖీలు

- ప్రత్యేక స్పీక్ రైలులో కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్ట్రన్ రైల్వే బృందం


రైల్వే రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ సిస్టంలో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

కాజీపేట రూరల్ : సౌత్ వెస్టన్ ఇంటర్ రైల్వే సేఫ్టీ ఆడిట్ అధికారుల బృందం గురువారం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. రైల్వే గేట్లు, వంతెనలు, సిగ్నల్ పాయింట్లు, ట్రాక్‌ను తనిఖీ చేసుకుంటూ కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్టన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది బృంద సభ్యులకు కాజీపేట రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సౌత్ వెస్టన్ రైల్వే హుబ్లీ ప్రిన్సిపాల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రామకృష్ణ నేతృత్వంలో సౌత్ వెస్టన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, కాజీపేట అధికారులు రైల్వే సీఆర్ఎస్ఈ వి.ఎం.దాస్‌పుత్ర, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ రవీంద్రనాథ్, సీటీపీఎఫ్ దినేశ్, సీనియర్ డీఎస్‌ఓ సురేశ్, సీఈఎల్ఈ, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియ అగర్వాల్, డీఓఎం జనరల్ సుధీర్‌కుమార్, కాజీపేట డీజిల్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్, కాజీపేట ఈఎల్ఎస్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, ఇతర అధికారులు బృందం వివిధ డిపార్ట్‌మెంట్లలో తనిఖీలు నిర్వహించారు. కాజీపేట రైల్వే స్టేషన్, 140 టన్నుల క్రేన్, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, మెడికల్ రిలీఫ్ వ్యాన్ ట్రైన్, క్యారియజ్ అండ్ వ్యాగన్ డిపో, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ డిపో, లోకోపైలెట్ కార్యాలయం, రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం, రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, రైల్వే ఇంజనీరింగ్ డిపో, సిగ్నల్ వ్యవస్థ, పాయింట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన విషయాలపై ఆరా తీసి నోట్ చేసుకున్నారు. గతంలో పలు చోట్ల జరిగిన రైలు ప్రమాదాలను గుర్తు చేస్తూ అలా జరగకుండా సేఫ్టీ నియమాలు పాటించాలని సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నం 3.09 గంటలకు చేరుకున్న అధికారుల బృందం.. రెండు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సాయంత్రం 5.20 గంటలకు కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. అధికారుల బృందం తనిఖీల్లో కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్‌తోపాటు అన్ని విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు పోటీచేస్తాం

- మహిళగా నన్ను అవమానించారు
- ఫోన్‌ట్యాపింగ్, స్త్రీనిధి, పీఆర్ అవినీతిలో జైలుకు ఖాయం
- దయాకర్‌రావుపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి ఫైర్


మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

హన్మకొండ చౌరస్తా: వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా నాటి యతిరాజారావు నుంచి మొన్నటి దయాకర్‌రావు వరకు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యులుగా ఉంటున్నాం.. అంతకుముందు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని జంగా రాఘవరెడ్డి తమను కోరాగా.. పార్టీలతో సంబంధం లేకుండా దయాకర్‌రావుకు సపోర్ట్ చేశామన్నారు.

అవమానాలు భరించలేకే రాజకీయాల్లోకి..

దయాకర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం సొంత ఖర్చుతో స్థలం కొనుగోలు చేసి ఇచ్చాం. స్థలం ఇచ్చే ముందు నా భర్త పేరుపెడతామని చెప్పి చేయలేదు. అప్పటి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు శానిటేషన్ ప్యాడ్స్ పంపిణీ నిలిపివేస్తే, మా సంస్థ ఆధ్వర్యాన ఇవ్వడానికి ముందుకొచ్చాం. ఆ కార్యక్రమానికి దయాకర్‌రావు రాలేదు. కలెక్టర్, స్కూల్ ఉపాధ్యాయులను సైతం రానివ్వకుండా చేశాడు. మేము చేసే అనేక కార్యక్రమాలను అడ్డుకుంటూ నన్ను అవమానించాడు. అమెరికా వెళ్లాక ఏనాడు రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. దయాకర్‌రావు చేసిన అవమానాలను తట్టుకోలేకే రావాల్సి వచ్చింది. మంత్రిగా దయాకర్‌రావు నా ఫోన్‌ను సైతం ట్యాపింగ్ చేయించారు. ఫోన్ ట్యాపింగ్, స్త్రీనిధి నిధుల గోల్‌మాల్, పంచాయతీ రాజ్ నిధుల్లో అక్రమాలు ఇలా అనేక విషయాల్లో ఆయన జైలుకు పోవడం ఖాయమన్నారు.

విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం


స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలను గురువారం టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిరంతరం విధుల్లో ఉంటూ ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడా పోటీలతో మానసిక, శారీరక విశ్రాంతి లభిస్తుందన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే వారందరం అన్నదమ్ములమే.. పోటీల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్(ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో) ఆధ్వర్యాన ఈనెల 14 వరకు జరిగే ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉంటాయని, కబడ్డీ 12 జట్లు, బాల్‌బ్యాడ్మింటన్ 9 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు, డీఈ టెక్నికల్ ఎ.విజయేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, కోశాధికారి ఎం.సంతోష్, కౌన్సిల్ సభ్యులు యాకూబ్‌పాషా,సునీల్ కుమార్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య


మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు తనవంతు కృషిచేస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల పున:ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పోటీపరీక్షల ద్వారానే నియమితులవుతారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే సర్కారు బడులు జ్ఞానకర్మాగారాలుగా మారుతాయన్నారు.ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థిగా ఉంటూ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, కృత్రిమ మేధతో తరగతి గదుల అనుసంధానం డిజిటల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారని విద్యాబోధన పద్ధతుల్లో నవీనప్రక్రియలను చేపడుతోందన్నారు. ఈవిద్యాసంవత్సరంలో 135 పాఠశాలల్లో కృత్రిమ మేధ తరగతులను,16 పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. డీఈఓ డి. వాసంతి మాట్లాడుతూ బడి బాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ బి. మనోజ్‌కుమార్, ఆ పాఠశాల హెచ్ఎం జి. ఉప్పలయ్య, రిటైర్డ్ హెచ్ఎం బి. రాధ, పర్యావరణ పరిరక్షణ సమితి బాధ్యులు, రిటైర్డ్ డీఎఫ్ఓ కాజీపేట పురుషోత్తం, అశోక్‌బాబు, ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ట్రెయినీ కలెక్టర్లు


ట్రెయినీ కలెక్టర్లకు మేడిగడ్డ బ్యారేజీ గురించి వివరిస్తున్న ఇరిగేషన్ డీఈ సురేశ్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ట్రెయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, సలోని చోబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తయానమావి, కొయ్యాడ ప్రణయ్ కుమార్ బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనను పరిశీలించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి కన్నెపల్లిలోని లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించింది. పంపుహౌస్ వివరాలను ఇరిగేషన్ డీఈ సత్యబాబు వివరించారు. విద్యుత్ వినియోగం, ఎత్తిపోతల వివరాలు, స్టోరేజీ, మోటార్ల సామర్థ్యం, సాగు, తాగు అవసరాల వినియోగంపై వివరించారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్ల బృందం మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీని సందర్శించింది. మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, లైసన్ అధికారి అబ్బాస్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్, డీఈ సురేశ్ తదితరులు ఉన్నారు. కాగా, ట్రెయినీ కలెక్టర్ సౌరభశర్మ శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు తొలగించారని..

ధర్మసాగర్: గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఓ యువకుడు బుధవారం గదిలో ఉంచి తాళం వేసి నిర్బంధించిన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం రాపాకపల్లిలో గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఇటీవల ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కందుకూరి ప్రశాంత్ అనే యువకుడి పేరు వచ్చింది. ప్రొసీడింగ్ ఇచ్చే సమయంలో అతడి పేరు లేదు. తన పేరు ఎలా తొలగిస్తారంటూ ప్రశాంత్ బుధవారం మధ్యాహ్నం గ్రామ పంచాయతీ కార్యదర్శి భోగి శ్రీనివాస్‌ను ఆఫీస్ గదిలో ఉంచి తాళం వేసి దూషించాడు. దీంతో అతను పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పగా వారు చేరుకుని ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మండలంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని, కార్యదర్శులు కూడా అనర్హుల పేర్లనే ఫైనల్ చేశారని ప్రజలు ఆరోపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

కాళేశ్వరం: కాళేశ్వరంలోని గోదావరి నదిలో పుణ్యస్నానానికి వచ్చిన ఓ వ్యక్తి.. నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కాశీంపల్లికి చెందిన నల్లపూరి రమేశ్ (58) కాళేశ్వరం వెళ్లి గోదావరి నదిలో పుణ్యస్నానం చేసి వస్తానని చెప్పి ఈనెల 10న ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే గురువారం ఉదయం గోదావరిలో ఓ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

సునీల్ కుటుంబానికి అండగా ఉంటా..

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


సునీల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్ : అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన సాక్షి ములుగు ఆర్‌సీ ఇన్‌చార్జ్ భూక్య సునీల్ కుటుంబానికి అండగా ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు గురువారం సునీల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా సునీల్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సునీల్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడంతోపాటు కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, నల్లెల భరత్‌కుమార్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీస్‌లు త్వరగా మంజూరు చేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లలో వ్యవసాయ సర్వీస్‌లను త్వరితగతిన మంజూరు చేయాలని ఆ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ లింకింగ్ లైన్లు 68 పూర్తి అయ్యాయని, ఈ నెలాఖరు వరకు మిగతా 97 పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రతీ సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ కాకుండా నిర్వహణ చేపట్టాలని, పిడుగుల నిరోధకం అమర్చాలని సూచించారు. పురోగతిలో ఉన్న కొత్త సబ్ స్టేషన్ల పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణాల్లో అవసరమైన చోట 8 ఎంవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్, జీఎంలు ఉత్తమ్, సురేందర్, డి.ఈలు అనిల్ కుమార్, ప్రభావతి పాల్గొన్నారు.

టైరు పేలి కారు బోల్తా..

- ఇద్దరు యువకుల దుర్మరణం
- వసంతాపూర్ శివారులో ఘటన


షోయబుద్దీన్, షేక్ మహ్మద్ మృతదేహాలు

గీసుకొండ: టైరు పేలి కారు చెట్టుకు ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ జిల్లా గీసుకొండ పీఎస్ పరిధిలోని వసంతాపూర్ శివారులో గురువారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కారులో నలుగురు యువకులు వరంగల్ నుంచి కోట వెంకటాపురం వెళ్లారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో వెంకటాపురం నుంచి వసంతాపురం గ్రామ శివారుకు చేరుకోగా వెనుక ఎడమవైపు టైరు పేలడంతో కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొని పల్టీలు కొట్టి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వరంగల్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎండి. షోయబుద్దీన్(17), వరంగల్ చింతల్‌కు చెందిన షేక్ మహ్మద్(18) అక్కడికక్కడే మృతి చెందారు. ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎండి. సమీర్‌పాషా, జాన్‌పాకకు చెందిన ఎండి. ఇస్మాయిల్ అలీకి తీవ్ర గాయాలు కాగా వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. గీసుకొండ ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

రాఘవాపురాన్ని సందర్శించిన కేంద్ర బృందం

- కేంద్ర జలశక్తి పురస్కారానికి ప్రామాణిక అంశాల పరిశీలన


ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాలకుర్తి టౌన్: కేంద్ర జలశక్తి పురస్కారానికి ప్రామాణిక అంశాలను పరిశీలించేందుకు గురువారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని రాఘవాపురం గ్రామాన్ని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ సైంటిస్టు పి. యాదయ్య, కేంద్ర వాటర్ కమిషన్ సబ్ డివిజన్ ఇంజనీర్ డి. చైతన్య సందర్శించారు. గ్రామంలో పదేళ్లలో భూగర్భ జలాలు పెంచడానికి చేపట్టిన పనులను ఈ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా యాదయ్య, చైతన్య మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయన్నారు. పురస్కారం అందజేయడానికి దేశంలో 30 గ్రామాలను ఎంపిక చేశామని, ఇందులో తెలంగాణలో రాఘవాపురం గ్రామం ఎంపికైందన్నారు. రాఘవాపురంలో వంద శాతం ఇంకుడు గుంతలు, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. గ్రామంలో చేపట్టిన ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని పరిశీలించామన్నారు. నివేదికను కేంద్ర భూగర్భ జలవనరుల శాఖకు అందజేస్తామని తెలిపారు. వారి వెంట డీఆర్‌డీఓ పీడీ వసంత, ఎంపీడీఓ ఆవుల రాములు, ఏపీఓ మంజుల, ఎంపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, కపిలవాయి వెంకటేశ్వరాచారి, యుగేందర్, శిరీష, ప్రియాంక, మహేశ్‌యాదవ్, లింగయ్య తదితరులు ఉన్నారు.

నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు


స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తి విత్తనాల ప్యాకెట్లు

చిట్యాల: నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నైన్‌పాక, కుమ్మరిపల్లి గ్రామాల్లో నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై శ్రవన్‌కుమార్‌తో పాటు, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోదాలు నిర్వహించారు. నైన్‌పాకకు చెందిన జంగ కుమార్, కుమ్మరిపల్లికి చెందిన బిక్కనూరు విజయ్ అనుమతి లేని ఆర్–కాట్–999 బీటీ–5, 32 ప్యాకెట్లు, ది క్యాప్టన్ పింక్ గార్డ్ –5జీ పత్తి విత్తనాలు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచుకున్నారు. దీంతో ఆ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నిషేధిత పత్తి విత్తనాల విలువ రూ.38 వేలు ఉంటుంది. ఈ ఘటనపై ఏఓ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిత్రకళా ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

- గూగుల్ వికీపీడియాలో రజనీకాంత్‌కు చోటు


రజనీకాంత్


చాక్‌పీస్‌పై తయారు చేసిన శివలింగాలు

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో చిత్రకళా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆడెపు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ సోషల్ మీడియా సంస్థ గూగుల్ రజనీకాంత్ ప్రతిభను గుర్తించి వికీపీడియాలో చోటు ఇచ్చింది. అంతర్జాతీయంగా, జాతీయంగా విభిన్న రంగాల్లో రాణిస్తూ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలు చేసే వారిని గుర్తించి గూగల్ వికీపీడియాలో సమాచారం పొందుపరుస్తారు. రజనీకాంత్ సూక్ష్మకళలో అంతర్జాతీయంగా రాణిస్తూ సుమారు 100కు పైగా విభిన్న ఆకృతుల్లో సూక్ష్మ కళాఖండాలను రూపొందించారు. ఇందుకు గాను ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డు, రికార్డు హోల్డర్ రిపబ్లిక్ ఇండియా రికార్డు, రెండు బుక్ ఆఫ్ స్టేట్ రికార్డులు, తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, సృజనపుత్ర అవార్డు, ఉత్తమ కళారత్న అవార్డు, గ్రామీణ కళాజ్యోతి అవార్డు, ఉత్తమ కళాకారుడి అవార్డులు అందుకున్నారు. రెండు బియ్యపు గింజలపై 278 అక్షరాలను, జాతీయగీతం జనగణమన, జాతీయగేయం వందేమాతరం రూపొందించారు. అంతేకాకుండా రజనీకాంత్ గుండుపిన్ను సహాయంతో పెన్సిల్ గ్రాఫైట్‌పై ప్రపంచంలో అతి సూక్ష్మ ఎత్తుకలిగిన గణపతి విగ్రహాన్ని రూపొందించడంతోపాటు చాక్‌పీస్‌లపై 78 జాతీయజెండాలను, 109 శివలింగాలను తయారు చేశారు. రజనీకాంత్ ప్రతిభను గుర్తించి పూర్తి సమాచారం సేకరించి వికీపీడియాలో పొందుపర్చినట్లు వికీపీడియా సమాచార సేకరణకర్త ఆత్రపు మోతీరామ్ తెలిపారు.

పెళ్లికి అడ్డుగా మారిన వరుస..

- కూతురు వరుస కావడంతో పెళ్లికి అభ్యంతరం చెప్పిన యువతి
- వేరే సంబంధాలు చూస్తుండగా మనస్తాపంతో ఏఈఈ ఆత్మహత్య


దేవీలాల్(ఫైల్)

బయ్యారం: ప్రేమికురాలితో కడదాకా జీవిద్దామనుకుంటే వరుస అడ్డురావడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ ప్రేమికుడు బలవన్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కాపువారిగూడెం గ్రామానికి చెందిన పానుగోత్ దేవీలాల్(34) మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో నీటిపారుదలశాఖ ఏఈఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత అక్టోబర్‌లో మొదటి పోస్టింగ్ పొందిన దేవీలాల్.. గార్లలో విధులు నిర్వర్తిస్తూ బయ్యారంలో అద్దెకుంటున్నాడు.

పెళ్లికి యువతి నిరాకరణ..

దేవీలాల్‌కు ఉద్యోగం రాకముందు పది సంవత్సరాలుగా తన తండాకు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువతి వరుసకు కూతురు అవుతుండడంతో పెళ్లికి అభ్యంతరాలొచ్చాయి. దీంతో మనస్తాపం చెంది మొదటిసారి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కాలు కోల్పోయాడు. ఆ తర్వాత ప్రభుత్వం ఉద్యోగం సాధించినా ఆ యువతిని మరవలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగం రావడంతో దేవీలాల్‌కు పెళ్లి చేసేందుకు కుటుంబీకులు సంబంధాలు చూస్తున్నారు. అయితే తాను ప్రేమించిన యువతితో పెళ్లి అయ్యే పరిస్థితి లేకపోవడంతో కొన్ని రోజులుగా డిప్రెషన్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగే ముందు చివరి ప్రయత్నంగా బుధవారం ప్రేమికురాలితో ఫోన్‌లో మాట్లాడాడు. అయితే వరుస కుదరని ఆ యువతి తెలపడంతో పురుగుల మందు తాగాడు. అనంతరం ఈ విషయాన్ని తమ కార్యాలయంలో పనిచేసే అటెండర్ కుమారుడికి ఫోన్‌లో తెలిపాడు. వెంటనే దేవీలాల్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి మంగ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు.